సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024





**రేడియో.. ఓ మధుర జ్ఞాపకం**
రేడియో ఒకప్పుడు కాలక్షేపానికి వినోద ప్రచార సాధనంగా నిలిచింది. నేడు టీవీలు, సెల్‌ఫోన్‌ల రాకతో కనుమరుగైంది.
వివరాలు 8లో ▸



**భక్తుల కొంగు బంగారం**
అనంత మహాలక్ష్మి పద్మనాభస్వామి ఆలయ ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి.
వివరాలు 8లో ▸



**విద్యార్థుల ప్రతిభకు..**
ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభకు జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ ఫిదా అయ్యారు.
వివరాలు 9లో ▸

## న్యూస్‌రీల్

### 40 మంది విద్యార్థుల ఎంపిక

సిద్దిపేటఅర్బన్: ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో 40 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు తెలిపారు. టెక్నికల్ రౌండ్, గ్రూప్ డిస్కషన్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ ఆధారంగా నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న 180 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి సంవత్సరానికి రూ.3.20 లక్షలు వేతనం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ హెచ్‌ఆర్ మేనేజర్ రేవంత్, హెచ్‌ఆర్ మేనేజర్ ప్రవీణ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ గోపికృష్ణ, పీఆర్వో రఘు తదితరులు పాల్గొన్నారు.

### పోటీకి 270 కథలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా స్థాయి ఉగాది బాలల కథల పోటీలకు 270 కథలు వచ్చాయని సుగుణ సాహితీ సమితి కన్వీనర్ బైతి దుర్గయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నాలుగేళ్లతో పోలిస్తే ఈసారి ఎక్కువగా కథలు వచ్చాయన్నారు. ఈ కథలు న్యాయ నిర్ణేతలకు పంపించి మార్చి నెలాఖరులో ఫలితాలు ప్రకటించనున్నట్లు తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ మర్పడగ చెన్నకృష్ణారెడ్డి సౌజన్యంతో విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు.

### సుస్థిర పాలన బీజేపీతోనే సాధ్యం

పార్టీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి



మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): దేశంలో సుస్థిర పాలన బీజేపీతోనే సాధ్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి అన్నారు. నూతనంగా నియమితులైన జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డిని సోమవారం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అక్కి సంతోష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాలన్నీ ఆర్థిక మాంద్యంలో కొట్టుమిట్టాడుతున్న సమయంలోనూ భారత్‌ను విశ్వ గురువుగా తీర్చిదిద్దిన ఘనత మోదీ ప్రభుత్వానిదేన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపుకోసం పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బాల్‌నర్స్ యాదవ్, భూమేష్ గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### సీఎస్సీ కేంద్రాలు ఏర్పాటు చేయండి

సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రఘోత్తంరెడ్డి



ములుగులో భవన మరమ్మతు పనులను పరిశీలిస్తున్న రఘోత్తంరెడ్డి

ములుగు(గజ్వేల్): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యాలయాల్లో సీఎస్సీ (కామన్ సర్వీస్ సెంటర్) కేంద్రాలను ఏర్పాటు చేసి ఈ-గవర్నెన్స్ సేవలను అందించాలని సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రఘోత్తం రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ములుగులో కొనసాగుతున్న పీఏసీఎస్ భవన మరమ్మతు పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సహకార సంఘాల ద్వారా రైతులకు అతి తక్కువ ధరలకే ఈ-గవర్నెన్స్ సేవలను అందించాలని సూచించారు. అలాగే సకాలంలో రైతులకు ఎరువులు, విత్తనాలను సరఫరా చేయాలన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ కార్యదర్శులు జితేందర్‌రెడ్డి, రమేశ్‌బాబులు పాల్గొన్నారు.

### పలువురు జిల్లా అధికారుల బదిలీ

సిద్దిపేటరూరల్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జెడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ, డీఆర్‌డీఓ, అదనపు డీఆర్‌డీఓ, డీపీఓ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలో డిప్యూటీ సీఈఓ పి.చిన్న ఓబులేష ప్రస్తుతం ఏపీడీగా ఉండగా బదిలీపై డీఆర్‌డీఓ నాగర్‌కర్నూల్ జిల్లాకు వెళ్లారు. అలాగే డిప్యూటీ సీఈఓ ఏపీడీగా ఉన్న జి.బాల్‌రాజు అదనపు డీఆర్‌డీఓగా సంగారెడ్డికి బదిలీ అయ్యారు. సిద్దిపేట అదనపు డీఆర్‌డీఓగా విధులు నిర్వహిస్తున్న కౌసల్యాదేవి డీఆర్‌డీఓ వరంగల్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. ములుగు జిల్లా అదనపు డీఆర్‌డీఓగా ఉన్న పి.బాలకృష్ణ సిద్దిపేటకు బదిలీపై వచ్చారు.

# మల్లన్న చెంతకు రైలు!

భక్తుల దశాబ్దాల కల త్వరలో నెరవేరనుంది. కొమురవెల్లి మల్లికార్జున స్వామి చెంత రైలు ఆగనుంది. పలువురి వినతులకు స్పందించి రైల్వే శాఖ కొమురవెల్లికి రైల్వే హాల్ట్ స్టేషన్‌ను మంజూరు చేసింది. ఈ నెల 15న హాల్టింగ్ స్టేషన్‌కు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.

– సాక్షి, సిద్దిపేట/కొమురవెల్లి



హాల్టింగ్ స్టేషన్ నిర్మాణం కోసం జేసీబీతో భూమి చదును

**నెరవేరనున్న దశాబ్దాల కల**

- కొమురవెల్లిలో రైల్వే హాల్టింగ్ స్టేషన్
- ఈ నెల 15న శంకుస్థాపన
- హాజరుకానున్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి
- భక్తులకు తప్పనున్న తిప్పలు

కొమురవెల్లి రైల్వే హాల్టింగ్ స్టేషన్‌ను పాత కమాన్‌రోడ్‌లో నిర్మించేందుకు స్థలం ఎంపిక చేశారు. పాత కమాన్ రోడ్ రైల్వే అండర్ పాస్‌ను నిర్మిస్తున్నారు. అక్కడి నుంచి సుమారు 300 మీటర్ల దూరంలో స్టేషన్‌ను నిర్మించనున్నారు. ఈ స్టేషన్ కోసం రైల్వే హైలెవల్ ప్లాట్ ఫారం, షెల్టర్, వెయిటింగ్ రూం, టికెట్ కౌంటర్లను నిర్మించనున్నారు.

**భక్తులకు సౌకర్యం**

రైల్వే హాల్టింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తుండటంతో భక్తులకు మరింత సౌకర్యంగా ఉండనుంది. దేవాలయానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు వస్తుంటారు. ప్రతీ ఏటా మూడు నెలల పాటు జాతర జరుగుతుంది. ఈ మూడు నెలల్లో సుమారు 80లక్షల మందికి పైగా భక్తులు మల్లికార్జున స్వామిని దర్శనం చేసుకుంటారు. మిగతా రోజుల్లో బుధ, ఆదివారాల్లో సైతం భక్తులు వస్తుంటారు. వీరు బస్సులు, ప్రత్యేక వాహనాల ద్వారా కొమురవెల్లికి చేరుకుంటారు. రైల్వే హాల్టింగ్ స్టేషన్ నిర్మాణం పూర్తయితే భక్తుల రాకపోకలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ఇప్పటికే సికింద్రాబాద్ నుంచి సిద్దిపేటకు రైలు రాకపోకలు రోజుకు రెండు మార్లు కొనసాగుతున్నాయి.

**పలువురికి వినతులు**

మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి రైల్వే ట్రాక్‌ను నిర్మించే సమయంలో కొమురవెల్లికి రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేయలేదు. దీంతో స్థానికులు, పలు రాజకీయ పార్టీల నేతలు గవర్నర్ తమిళిసై, కేంద్ర మంత్రులకు వినతులు అందించారు. ఢిల్లీకి సైతం పలు మార్లు రైల్వే ఉన్నతాధికారులను కలిసి పుణ్యక్షేత్రం, వచ్చే భక్తుల సంఖ్య గురించి వివరించారు. దీంతో రైల్వే శాఖ స్పందించి రైల్వే హాల్టింగ్ స్టేషన్‌ను మంజూరు చేసింది.

**తక్కువ ఖర్చుతో కొమురవెల్లికి**



కొమురవెల్లి మల్లికార్జున స్వామివారిని దర్శించుకునేందుకు మన రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల నుంచి భక్తులు వస్తుంటారు. రైల్వే స్టేషన్ ఏర్పాటు చేస్తుండటంతో తక్కువ ఖర్చులతో స్వామి వారిని దర్శించుకునే అవకాశం కలగనుంది.

– మహాదేవుని మల్లికార్జున్, ఆలయ ప్రధాన అర్చకులు

**భక్తుల సంఖ్య పెరిగే అవకాశం**



కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయడంతో హైదరాబాద్ నుంచి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుంది. దీంతో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. రైల్వేస్టేషన్ ఏర్పాటు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలి.

– బాలాజీ, ఈఓ

**ఇక మరింత అభివృద్ధి**



రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేస్తున్నందుకు ధన్యవాదాలు. దేవాలయంతో పాటు గ్రామం సైతం మరింత అభివృద్ధి చెందనుంది. భక్తులకు మరింత సౌకర్యంగా మారనుంది.

– సానాది కరుణాకర్, కొమురవెల్లి



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఈటల రాజేందర్, చిత్రంలో రఘునందన్‌రావు తదితరులు

# మోదీ నాయకత్వమే రక్ష

**కేంద్రంలో మూడోసారి అధికారం బీజేపీదే**

- పార్టీ అగ్రనేత ఈటల రాజేందర్
- గజ్వేల్‌లో నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం

గజ్వేల్: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ 400 ఎంపీ సీట్లు గెలుచుకొని నరేంద్రమోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని మాజీ మంత్రి, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. దేశానికి మోదీ నాయకత్వమే రక్ష అని అన్నారు. సోమవారం సాయంత్రం గజ్వేల్‌లోని ప్రజ్ఞా గార్డెన్స్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బీజేపీ కార్యకర్తల సమావేశానికి దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ మోదీ నేతృత్వంలో అన్ని రాష్ట్రాల్లో అభివృద్ధి జరిగిందని కొనియాడారు. 2014 పార్లమెంటు ఎన్నికల్లో 273 సీట్లు, ఆ తర్వాత 2019లో 303 సీట్లు గెలుచుకొని అధికారం చేపట్టిన మోదీ రాబోవు ఎన్నికల్లో 400 సీట్లను గెలుచుకోవడం ఖాయమన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడిన ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

**ఉనికి కోసమే కేఆర్‌ఎంబీ పంచాయితీ: రఘునందన్‌రావు**

దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఉనికి కోసమే అసెంబ్లీలో కేఆర్‌ఎంబీ (కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు) పంచాయితీని తెరపైకి తెచ్చాయని ఆరోపించారు. 2015లో ఉమా భారతి కేంద్ర జలవనరుల మంత్రిగా ఉన్న సమయంలో అప్పటి సీఎం కేసీఆర్, నీళ్ల మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావులు ఏపీ, తెలంగాణ జలవాటా పంపిణీ సందర్భంలో తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 511 టీఎంసీలు పంచాలని ఒప్పుకొని సంతకం చేసిన విషయం గుర్తు లేదా... అంటూ మండిపడ్డారు. ఎంపీ ఎన్నికల్లో ఒకటి, రెండు సీట్లు గెలవకపోతే బీఆర్‌ఎస్ ఫామ్‌హౌస్‌కే పరిమితం కానుందని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లది బొమ్మా.. బొరుసు లాంటి బంధమని విమర్శించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మెదక్ పార్లమెంటరీ ప్రభారి శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర నాయకులు రాంరెడ్డి, ఆకుల రాజయ్య, గురువారెడ్డి, మురళీయాదవ, వెంకటరమణ, నందన్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు పేర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు సురేష్‌గౌడ్, విభీషన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కుడిక్యాల రాములు, అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, స్థానిక నాయకులు మనోహర్ పాల్గొన్నారు.

**పోచమ్మకు బోనాలు..**



బోనాలతో తరలివస్తున్న మహిళలు

కోహెడ మండలం గుండారెడ్డిపల్లిలో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం గ్రామంలో మహిళలు ప్రతి ఇంటి నుంచి బోనం ఎత్తుకుని ఆలయానికి ఊరేగింపుగా తరలివచ్చారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. శివసత్తుల శిగాలు.. డప్పుచప్పుళ్లతో ఆలయ పరిసరాలన్నీ సందడిగా మారాయి.

– కోహెడరూరల్ (హుస్నాబాద్)

# రెవెన్యూ డివిజన్ ప్రకటన ఇంకెప్పుడు?

- అసెంబ్లీ సమావేశాల్లో వెలువడని ప్రకటన
- ఎదురుచూపుల్లో ప్రజలు

దుబ్బాకటౌన్: దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ప్రజలు కోటి ఆశలు పెట్టుకున్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రకటన వెలువడుతుందని అందరూ ఎదురు చూసినా నిరాశే ఎదురైంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక రెవెన్యూ డివిజనే ప్రధాన పార్టీలకు ప్రధాన అస్త్రం. 2020లోనే డివిజన్ ఏర్పాటు చేస్తారని ఆశించినా ఆ కల నెరవేరలేదు.

**ఉద్యమం..**

తెలంగాణ ఆవిర్భవించాక జిల్లాల పునర్విభజన సమయంలో దుబ్బాక రెవెన్యూ డివిజన్‌గా చేస్తారని ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూశారు. కానీ నిరాశే ఎదురైంది. దీంతో 2016లో దుబ్బాకలో 45రోజుల పాటు ఉద్యమం తీవ్రంగా జరిగింది. అప్పటి నుంచి నిరంతరం ఉద్యమాలు కొనసాగుతూనే ఉన్నాయి.



దుబ్బాక పట్టణం వ్యూ..

**6 మండలాలతో డివిజన్**

నియోజకవర్గంలో ప్రస్తుతం 8 మండలాలు ఉండగా చేగుంట, నార్సింగ్ మండలాలు తూప్రాన్ డివిజన్‌లో ఉన్నాయి. సిద్దిపేట డివిజన్‌లో ఉన్న దుబ్బాక, మిరుదొడ్డి, తొగుట, భూంపల్లి-అక్బర్‌పేట మండలాలతో పాటు గజ్వేల్ డివిజన్‌లోని దౌల్తాబాద్, రాయపోల్ మండలాలతో కలిపి మొత్తం 6మండలాలతో దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటుచేసే అవకాశాలు ఉన్నాయి.

**సీఎం రేవంత్‌రెడ్డి హామీ..**

దుబ్బాకలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో తప్పకుండా హామీ నెరవేరుస్తారని ప్రజలు ఎదురు చూసినా నిరాశ తప్పలేదు.

**డివిజన్ ఏర్పాటుకు కృషి**



దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తా. ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఈ హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాను.

– కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే

# అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు

- త్వరితగతిన పరిష్కరించాలి
- అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: ప్రజావాణిలో ప్రజలు అందిస్తున్న అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉంచొద్దని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని మీటింగ్‌హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల అర్జీల పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కరించాలన్నారు. వివిధ రకాల సమస్యల పరిష్కారం కోరుతూ మొత్తంగా 23 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ నాగరాజమ్మ, డీఆర్‌డీఏ పీడీ జయదేవ్‌ఆర్యా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**వక్ఫ్ భూములు కాపాడండి**

నంగునూరు మండల కేంద్రంలో వక్ఫ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ముస్లింలు వాపోయారు. ఈ మేరకు వారు ప్రజావాణిలో అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ భూములకు ఆనుకుని ఉన్న పట్టా భూములను కొనుగోలు చేసిన వారు వీటిని సైతం లేవలింగ్ చేస్తున్నారన్నారు. దీంతో తమకు సంబంధించిన శ్మశానవాటిక పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి తమ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు.

**మా భూములు మాకివ్వండి..**

తొగుట మండలం బండారుపల్లిలో ఉన్న మా భూములు మాకివ్వాలని బాధితులు వాపోయారు. ప్రజావాణిలో అర్జీ సమర్పించిన అనంతరం వారు మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం సర్వే నంబర్ 361లో గల భూమిని 13 మంది దళిత రైతులకు 0-35 గుంటల చొప్పున ప్రభుత్వం అందించిందన్నారు. తమ భూములను ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమకు ఆ భూములు తిరిగి అప్పగించాలని వేడుకున్నారు.

**వెంటనే పరిష్కరించాలి**

జిల్లా వ్యాప్తంగా దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ నెల రావాల్సిన పెన్షన్ సకాలంలో రాకపోవడం వల్ల చాలా ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సంక్షేమ శాఖ నుంచి తమ శాఖను విడదీసి ప్రత్యేకంగా అధికారులను కేటాయించాలన్నారు. దివ్యాంగులకు అంత్యోదయ, గృహ నిర్మాణ పథకం, రూ. 10లక్షల వరకు రుణసదుపాయం, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సౌకర్యాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకులు శంకర్, నారాయణ, సరిత తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగులు

# భక్తి మార్గంలోనే మానసిక ప్రశాంతత

- ముచ్చింతల్‌లో 20 నుంచి సమతాకుంభ్ వేడుకలు
- త్రిదండి చినజీయర్‌స్వామి



మాట్లాడుతున్న చినజీయర్ స్వామి

రాయపోలు(దుబ్బాక): భక్తి మార్గంలోనే మనిషికి మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని త్రిదండి చిన జీయర్‌స్వామి అన్నారు. రాయపోలు మండలం ఎల్కల్‌లో అనంత పద్మనాభస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపక కార్యక్రమానికి సోమవారం ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభానికి పూజ చేశారు. అనంతరం ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతకు కొంతైనా సమయాన్ని కేటాయించాలన్నారు. భగవంతుని మార్గంలో నడిస్తే ప్రపంచం చక్కగా ఉంటుందన్నారు. దైవం ముందు అందరూ సమానులేనన్నారు. ఈ నెల 20 నుంచి ముచ్చింతల్‌లోని సమతా మూర్తి ఆలయంలో 10 రోజుల పాటు సమతా కుంభ్ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆయుష్ విభాగం మాజీ కమిషనర్ డాక్టర్ అట్ల రాజేందర్‌రెడ్డి, ఆలయ వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డి, స్థానిక ఎంపీటీసీ వెంకటయ్య, భక్తులు పాల్గొన్నారు.

# సాగు నీటి కోసం రైతుల ధర్నా



ఎస్‌ఈ కార్యాలయం ఎదుట బైఠాయించిన రైతులు

చిన్నకోడూరు(సిద్దిపేట): సాగు నీటి కోసం రైతులు ఆందోళనకు దిగారు. నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని.. రంగనాయక సాగర్ ఎడమ కాలువ ద్వారా నీళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని గంగాపూర్, చిన్నకోడూరు గ్రామాల రైతులు సోమవారం ఇరిగేషన్ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బెల్లంకుంట, కర్ణాలకుంట, గంగాపూర్‌లోని గాండ్ల చెరువులకు నీరు రాకపోవడంతో ఆ ప్రాంతంలో పంటలు ఎండిపోతున్నాయన్నారు. అధికారులు స్పందించి కుంటలు, చెరువుల్లో నీటిని నింపాలని కోరారు. లేదంటే మా పంటలు ఎండిపోయి నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అనంతరం ఇరిగేషన్ డీఈ కార్యాలయంలో రైతులు వినతి పత్రం అందజేశారు. వీరికి మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు జంగిటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కరాటేలో పతకాలు

సిద్దిపేటజోన్: డ్రాగన్ ఫైటర్స్ మాస్టర్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మూడవ అంతర్జాతీయ కరాటే-కుంగ్ ఫూ పోటీల్లో సిద్దిపేట విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కటాస్, స్పైరింగ్, వేపన్ కటాస్ విభాగంలో శ్రీయాన్, రాము, సాయి వర్మ, శరణ్య, హరిహరన్, అశ్విత్, అభినయ్ పతకాలు సాధించారు. కార్యక్రమంలో స్పార్క్ కుంగ్ ఫూ అకాడమీ చీఫ్ రఘునందన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సైన్స్ డే పోటీల్లో ప్రతిభ

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని వివిధ పాఠశాల విద్యార్థులకు సైన్స్ డే కార్యక్రమములో భాగంగా శనివారం, సోమవారం వ్యాసరచన, వకృత్వ, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. మెదక్‌లోని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు జరిగాయి. ఇదే పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని సోహా మెహవిన్ ఉపన్యాస పోటీలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రాధాకిషన్‌తోపాటు ఎంఈఓ నీలకంఠం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పీ.రేఖ, సైన్స్ ఆఫీసర్ రాజిరెడ్డి తదితరులు సోహను అభినందించారు.

### పాన్ కోసం రోడ్డు దాటుతుండగా..

#### బైక్ ఢీకొని వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంది మండలం కొలంపేటకు చెందిన మహమ్మద్ చాంద్ పాషా (46) పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో చికెన్ షాప్ నిర్వహిస్తుంటాడు. ఆదివారం రాత్రి తన ఎదురుగా ఉన్న దుకాణంలో పాన్ కొనుగోలు చేసేందుకు వెళ్తున్నాడు. అదే సమయంలో ఇస్నాపూర్ నుంచి పాశమైలారం వైపు వెళ్తున్న బైక్ చాంద్ పాషాను బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన పాషాను పటాన్‌చెరులోని ఓ ఆస్పత్రికి తరలించగా కొద్దిసేపటికి మృతిచెందాడు. బైక్ దారుడు సంజయ్ ప్రజాపతిగా గుర్తించి మృతుడి కుమారుడు మహమ్మద్ జయల్ పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### కాలినడకన వెళ్తుండగా..

#### గుర్తు తెలియని వాహనం ఢీ

అల్లాదుర్గం(మెదక్): వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన కాసాల సిద్ధప్ప (28) ఆదివారం చిల్వెర గ్రామానికి కాలినడకన వెళ్లాడు. రాత్రి తిరిగి బొడ్మట్‌పల్లి గ్రామానికి వస్తుండగా చిల్వెర గ్రామ శివారులో 161 జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన సిద్ధప్పను జోగిపేటలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి బావమర్ది సాయిబాబా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### అప్పుల బాధతో ఆత్మహత్య

నర్సాపూర్ రూరల్: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సాపూర్ మండలంలో సోమవారం చోటు చేసుకుంది. నర్సాపూర్ ఎస్సై పుష్పరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అవంచ గ్రామానికి చెందిన జగ్గంపేట శ్రీశైలం (55) వ్యవసాయ కూలీ పనులు చేస్తుంటాడు. ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

#### ఆర్థిక ఇబ్బందులతో..

తూప్రాన్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని డబుల్ బెడ్రూంలో నివాసం ఉంటున్న హాజీపాషా(44), సైదాబేగం దంపతులకు ముగ్గురు కూతుళ్లు. ఈ నెల 5న పెద్ద కూతురు వివాహం చేశారు. ఇందుకు సుమారు రూ.5 లక్షల వరకు అప్పు అయ్యింది. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం కూతురు, అల్లుడు ఇంటికొచ్చే సరికి గొడవ జరుగుతుండగా వారు వెళ్లిపోయారు. ఈక్రమంలో సోమవారం తెల్లవారు జామున హాజీపాషా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# భక్తుల కొంగు బంగారం

**అనంత మహాలక్ష్మీ పద్మనాభస్వామి**
- నేటి నుంచి 23వ వార్షికోత్సవ ఉత్సవాలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ నిర్వాహకులు


అనంత మహాలక్ష్మీ పద్మనాభ స్వామి ఆలయం

దుబ్బాకటౌన్ : కోరిన భక్తుల కొంగుబంగారంగా ప్రసిద్ధి గాంచింది శ్రీ అనంత మహాలక్ష్మీ పద్మనాభస్వామి. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చేర్వాపూర్ వద్ద వెలిసిన ఈ ఆలయంలో అనతికాలంలోనే ప్రసిద్ధి చెందడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తుంటారు. ఈ నెల 13వ తేదీ నుంచి ఆలయం 23వ వార్షికోత్సవ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో నిర్వాహకులు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**రెండు రోజులపాటు**

అనంత మహాలక్ష్మీ ఆలయాన్ని వార్షికోత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ ఉత్సవాలు మంగళవారం, బుధవారం జరుగుతాయి. ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజ-పుణ్యాహవచనంతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. శ్రీ మాధవానంద సరస్వతీ స్వామీజీతోపాటు పలువురు స్వామీజీల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలు, భక్తులకు అనుగ్రహ భాషణము నిర్వహిస్తారు. బుధవారం రోజున ఉదయం 10 గంటలకు అనంతమహాలక్ష్మీ, పద్మనాభస్వామి వారి కల్యాణోత్సవం జరిపిస్తారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున హాజరుకానుండడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

**ఏర్పాట్లు పూర్తి**



అనంత మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం గొప్ప దివ్యక్షేత్రం. అమ్మవారి కృపతో అనతి కాలంలోనే ఆలయం గొప్ప దివ్యక్షేత్రంగా మారింది. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని కొలుచుకునేందుకు వస్తుంటారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశాం.

-రాయిని అంబదాసు, ఆలయ బాధ్యులు

**అనతికాలంలోనే ప్రసిద్ధి**



అనంత మహాలక్ష్మీ అమ్మవారు చాలా మహిమగల తల్లి. అమ్మవారిని కొలుచుకున్న వారికి సర్వ సుఖాలు దక్కుతాయి. చాలా పవిత్రమైన అమ్మవారు. అనతి కాలంలోనే ఈ ఆలయం ప్రసిద్ధి చెందింది. పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తూ అమ్మవారిని కొలుచుకుంటారు.

-వేలేటి జయరామశర్మ, వేదపండితుడు

# రేడియో.. ఓ మధుర జ్ఞాపకం

- ప్రస్తుతం వినిపించని మాటలు, పాటలు
- పెరిగిపోయిన కలర్ టీవీలు, ఫోన్లు
- రానురాను పూర్తిగా కనుమరుగు
- నేడు అంతర్జాతీయ రేడియో దినోత్సవం


నాటి తరం రేడియో

మిరుదొడ్డి(దుబ్బాక): రేడియో ఈ పేరు వింటే చాలు ఒకప్పుడు కాలక్షేపానికి వినోద ప్రచార సాధనంగా నిలిచింది. నాడు రేడియోలో వచ్చే ధ్వని కార్యక్రమాలు మనసుతో చూసేలా కంటికి కదలాడేవి. సుప్రభాత పాటలతో పల్లెలను, పట్టణాలను మేలుకొల్పేవి. సినిమా, జానపద గీతాల ప్రసారాలతో మనసును ఉరకలెత్తించేవి. మధ్యాహ్నం కార్మిక లోకాన్ని తట్టి లేపేవి. సాయంత్రం రేడియోలో వచ్చే వార్తలు, వ్యవసాయ సాగు పద్ధతులు జనరంజకంగా పలకరించేవి. అలసిన ప్రతి ఒక్కరికీ కమ్మనైన సంగీతంతో మనసును ఓలలాడించి నిద్ర పుచ్చేవి. కానీ శాస్త్ర పరిజ్ఞానం పెరిగిపోయి కలర్ టీవీలు, సెల్ ఫోన్ల రాకతో రేడియోలు కనుమరుగయ్యాయి. రేడియోతో ఉన్న తమ అనుబంధాన్ని ఒదులుకోలేక కొందరు రేడియో ప్రియులు రేడియోలను భద్రంగా దాచుకుంటూ వాటితో ఉన్న జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్నారు.

**కనిపించని రేడియో**

శాస్త్ర పరిజ్ఞానం పెరిగిపోవడంతో మొదట బ్లాక్ అండ్ వైట్ టీవీల రాకతో కాస్త వెనుక బడ్డ రేడియోలు కలర్ టీవీలు ఇంటింటికీ రంగ ప్రవేశం చేశాక పూర్తిగా మూలనపడ్డాయి. ప్రస్తుతం ప్రతీ ఒక్కరి జేబులో సెల్ ఫోన్లు మార్మోగి పోతుండడంతో రేడియోలు పూర్తిగా కనుమరుగయ్యాయి. సెల్‌ఫోన్‌లో ప్రపంచం నలు మూలల్లో జరిగే వార్తా విశేషాలు ఎప్పటికప్పుడూ తెలిసి పోతుండటంతో రేడియోల వినియోగం ప్రశ్నార్థకంగా మారింది.

**రేడియో దినోత్సవం**

రేడియో కనుమరుగైపోతున్న క్రమంలో యునెస్కో 36వ కాన్ఫరెన్స్ సమావేశంలో 2011 నవంబర్ 13న తీసుకున్న తీర్మాణం ప్రకారం 2012 ఫిబ్రవరి 13న తొలి సారిగా అంతర్జాతీయ రేడియో డేగా ప్రారంభమయ్యాయి.

**ఇప్పటికీ దాచుకున్నా..**



నా చిన్నప్పుడు ఎక్కువ రేడియోతోనే పోపతి ఉండేది. అప్పుడు రేడియోలు పెద్ద పెద్ద వాళ్ల ఇళ్లల్లో ఉంటుండే. నాకు కూడా ఒక రేడియో కొనుక్కోవాలని అనిపించింది. నాడు బ్యాటరీలతో రేడియోలు పని చేస్తుండే. రాను రాను ఇంటింటికీ కలర్ టీవీలు, సెల్ ఫోన్లు రావడంతో రేడియోలు మూలకు పడ్డాయి. ఇప్పుడు రేడియోలు వాడాలంటే బ్యాటరీలు మార్కెట్‌లో దొరకడం లేదు. వాటిని రిపేరు చేసే వాళ్లు లేకుండా పోయారు. ఇప్పటికీ రేడియోను భద్రంగా దాచుకున్న.

– ఎర్రోల్ల బాల్‌నర్సయ్య, మిరుదొడ్డి

# రూ.లక్షకు బాలుడి విక్రయం

**తండ్రితో సహా నలుగురు అరెస్ట్**

జిన్నారం(పటాన్‌చెరు): బాలుడిని విక్రయించిన కేసులో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు జిన్నారం సీఐ సుధీర్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ సోమవారం వెల్లడించారు. మహారాష్ట్రలోని కొడ్లురీ గ్రామానికి చెందిన ఆశిక్ తులసీరాం హట్వార్, మాధురీయాదవ్ ఇకర్ కొంతకాలంగా గుమ్మడిదల మండలంలోని దోమడుగు గ్రామంలో నివాసం ఉంటున్నారు. వీరికి రెండేళ్ల బాబు నాక్ష్ ఉన్నాడు. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండడంతో విడిపోవాలని నిర్ణయించుకున్నారు. దీనికి కుమారుడు అడ్డుగా ఉన్నాడని తండ్రి తులసీరాం హట్వార్ భావించాడు. అదే గ్రామానికి చెందిన శేరి విఠల్‌రెడ్డి, అతడి భార్య రాజేశ్వరితో కలిసి బాబును విక్రయించేందుకు నిర్ణయించాడు. వారం రోజుల కిందట నిజాంపేటకు చెందిన ముస్తీ స్వామి, ముస్తీ కల్పన దంపతులకు బాలుడు నాక్ష్‌ను రూ.లక్షకు విక్రయించారు. దీంతో తల్లి మాధురియాదవ్ ఇకర్ గుమ్మడిదల పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ జరిపిన పోలీసులు బాలుడిని విక్రయించిన తండ్రి తులసీరాం హట్వార్‌తో పాటు ఇందుకు సహకరించిన శేరి విఠల్‌రెడ్డి, రాజేశ్వరి, బాలుడిని స్వీకరించిన ముస్తీ స్వామి, ముస్తీ కల్పన దంపతులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తల్లితోపాటు బాలుడిని సంగారెడ్డిలోని సీడబ్ల్యూసీ కేంద్రానికి తరలించినట్లు సీఐ తెలిపారు.

### పోక్సో కేసులో జీవిత ఖైదు

**రూ.లక్ష జరిమానా**

మెదక్ మున్సిపాలిటీ: పోక్సో కేసులో నిందితుడికి జీవితఖైదుతోపాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ డాక్టర్ బాలస్వామి తెలిపారు. పట్టణంలోని పంచముఖి కాలనీకి చెందిన కర్ణకంటి గోపాల్‌పై 2023లో మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు అయ్యింది. సోమవారం జిల్లా కోర్టులో విచారణకు రాగా వివరాలు పరిశీలించిన న్యాయమూర్తి లక్ష్మీ శారద నిందితుడికి శిక్షవించినట్లు పేర్కొన్నారు. కేసు త్వరగా పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# తక్కువ ధరకు కెమెరాలు ఇప్పిస్తానని టోకరా..

**నిందితుడి అరెస్ట్**

రాయపోలు(దుబ్బాక): తక్కువ ధరకే డిజిటల్ కెమెరాలు ఇప్పిస్తానని నమ్మబలికి ఆన్‌లైన్‌లో డబ్బులు వేయించుకొని ఉడాయించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. తొగుట సీఐ లతీఫ్ తెలిపిన వివరాల మేరకు.. ఏపీలోని విశాఖపట్నం ప్రాంతానికి చెందిన ధనాల సూరజ్ అలియాస్ రాహుల్ బోయిన్‌పల్లిలో నివాసముంటున్నాడు. ఇతడు పలువురిని ఆన్‌లైన్‌లో పరిచయం చేసుకొని ఖరీదైన డిజిటల్ కెమెరాలను తక్కువ ధరకు ఇప్పిస్తామని నమ్మబలికాడు. రాయపోలు మండలం బేగంపేటకు చెందిన సంగాని బాలరాజును ఫోన్‌లో పరిచయం చేసుకున్న రాహుల్.. డిజిటల్ కెమెరా రూ.50 వేలకే ఇప్పిస్తానని నమ్మించి గతేడాది నవంబర్ 16న రూ.50 వేలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. అనంతరం అతడి ఫోన్ కలవకపోవడంతో బాలరాజు తాను మోసపోయినట్లు గుర్తించి బేగంపేట పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న ఎస్సై అరుణ్‌కుమార్, గజ్వేల్ ఏసీపీ రమేశ్, సైబర్ క్రైమ్ ఏసీపీ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో తొగుట సీఐ లతీఫ్, సైబర్ క్రైమ్ ఎస్సై శేఖర్, బేగంపేట ఎస్సై అరుణ్‌లు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో విచారించారు. మోసగాడిపై పలు పోలీస్‌స్టేషన్‌లలో కేసులు ఉండగా, పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. మొత్తం రూ.4 లక్షల 46 వేలు కాజేయగా.. రూ.10 వేలు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

# తాళం వేసిన ఇళ్లలో చోరీ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్‌ఐ సునీత

పెద్దశంకరంపేట(మెదక్): తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి పెద్దశంకరంపేట చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పేట పట్టణంలో పాత గ్రామపంచాయతీ వీధిలో స్వర్ణకారుడు ఆవుసుల శ్రీనివాసచారి కుటుంబ సభ్యులతో ఆదివారం ఇంటికి తాళం వేసి బంధువుల వద్దకు వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికొచ్చి చూడగా బీరువా తాళం పగులగొట్టి ఉంది. అందులోని రూ.3లక్షలు దొంగలు ఎత్తుకెళ్లారు. ముందు భాగంలో తాళం వేసినట్లుగానే ఉందని, వెనుక భాగం నుంచి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నగదు ఎత్తుకుపోయినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ సునీత, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మెదక్ మున్సిపాలిటీ: తాళం వేసిన ఇళ్లల్లో చోరీ జరిగిన ఘటన మెదక్ పట్టణం శాంతినగర్ లో చోటు చేసుకుంది. పోలీస్‌ల కథనం మేరకు.. మెదక్ పట్టణం శాంతి నగర్‌కు చెందిన మహేశ్, సద్దాం ఇంటికి తాళం వేసి బంధువుల వద్దకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయం గమనించిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని 23 తులాల వెండి, రూ.15 వేలు చోరీ చేశారు. ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని చూసిన స్థానికులు మహేశ్‌కు సమాచారం ఇచ్చాడు. మహేశ్ వచ్చి చూడగా ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లో చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే సద్దాం ఇంట్లో సైతం చోరీ ప్రయత్నం చేయగా, ఎలాంటి వస్తువులు పోలేదు. సమాచారం మేరకు ఘటనా స్థలాలను మెదక్ డీఎస్పీ ఫణీంద్ర, మెదక్ సీఐ దిలీప్ చేరుకొని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**రూ.మూడు లక్షల నగదు అపహరణ**


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

# గుండంలో పడి యువకుడు మృతి


శివకుమార్ మృతదేహం

సిద్దిపేటరూరల్: పుల్లూరు బండ జాతరకు వెళ్లిన యువకుడు కాలు జారి గుండంలో పడిపోయి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల, ఫిర్యాదుదారు వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణానికి చెందిన దాసరి శివకుమార్ (19) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. తరచూ చుట్టుపక్కల వారితో గొడవకు పడేవాడు. ఈనెల 10వ తేదీన శివకుమార్ పుల్లూరు బండ జాతరకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. సోమవారం ఉదయం శివకుమార్ బంధువైన శ్రీనుకు జాతర గుండంలో పడి ఎవరో చనిపోయారని చుట్టుపక్కల వారి ద్వారా తెలిసింది. వెంటనే శ్రీను శివకుమార్ తల్లి నిర్మలకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లేసరికి పోలీసులు స్థానికుల సాయంతో మృతదేహాన్ని తీసుకొని సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. మృతదేహం చేతికి ఉన్న ఓం గుర్తు కంకణం, మెడపై ఉన్న టాటూను, బట్టలను చూసి కుటుంబీకులు చనిపోయింది శివకుమార్‌గా గుర్తించారు. తాగిన మైకంలో కాలుజారి గుండంలో పడి చనిపోయాడని, తమ కొడుకు మృతిపై ఎలాంటి అనుమానం లేదని తల్లి నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

# మహిళపై దుండగుల దాడి

- రక్తపు మడుగులో అక్కడికక్కడే మృతి
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ ఫణీందర్


సంగమణి మృతదేహం

హవేళిఘణాపూర్(మెదక్): మహిళ దారుణంగా హత్య చేసిన ఘటన మండల పరిధిలోని తొగిట గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మంద ఆశయ్య మొదటి భార్య సంగమణి(48) సోమవారం ఇంటి వద్ద ఒంటరిగా ఉంది. సాయంత్రం సమయంలో గుర్తు తెలియని దుండగులు వచ్చి పదునైన ఆయుధంతో ఆమె ముఖంపై బలంగా బాదారు. ఆశయ్య, అతడి రెండవ భార్య మంజుల బంధువుల విందుకు వెళ్లొచ్చేసరికి సంగమణి రక్తపు మడుగులో పడి చనిపోయి ఉంది. వెంటనే వారు హవేళిఘణాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. మెదక్ డీఎస్పీ ఫణీందర్, మెదక్‌రూరల్ సీఐ, పట్టణ సీఐలు ఘటనా స్థలాన్ని పరిశీలించి డాగ్ స్క్వాడ్‌ను రప్పించి పరిశీలించారు. ఆశయ్యకు ఇద్దరు భార్యలు కావడంతో తరుచూ గొడవలు జరుగుతుండేవి. ఈ హత్యకు కుటుంబ సభ్యుల పాత్ర ఉందా..? వేరే ఎవరైనా చంపారా..? అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

### ఫిర్యాదుల స్వీకరణ


ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్పీ బాలస్వామి

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఎస్పీ డాక్టర్ బాలస్వామి ప్రజావాణి నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని పరిశీలించిన ఆయన సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో మాట్లాడారు. చట్ట పరిధిలో న్యాయం జరిగేలా చూడాలని సూచించారు.

# డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు, జరిమానా

రామాయంపేట(మెదక్): డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డ ఇద్దరికి జైలుశిక్షతోపాటు జరిమానా విధించారు. ఎస్‌ఐ రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేట మండలం జాన్సిలింగాపూర్‌కు చెందిన వడ్డె నరేందర్, సిద్దిపేట జిల్లా భూంపల్లి గ్రామస్తుడు బోయిని రవి ఇటీవల మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. ఇద్దరినీ మెదక్ కోర్టులో హాజరుపర్చగా రవికి రూ.వెయ్యి జరిమానాతోపాటు ఒక రోజు జైలుశిక్ష, వడ్డె నరేందర్‌కు రూ.200 తోపాటు ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ మెదక్ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ కల్పన తీర్పు వెల్లడించారు.

**13 మందికి జరిమానా..**


సంగారెడ్డి టౌన్: డ్రంకెన్ డ్రైవ్ లో పట్టుబడ్డ 13 మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన ఘటన సంగారెడ్డి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ సుమన్ కుమార్ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 13 మందిని డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుకున్నట్లు తెలిపారు. వీరిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి ఒక్కొక్కరికీ రూ.10 వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

నిజాంపేట(మెదక్): నిజాంపేటకు చెందిన బెస్త రాములు గత నెల 5 తేదీన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడగా సోమవారం మెదక్ స్పెషల్ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ కల్పన ఒక రోజు జైలుశిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# భూ తగాదాలతో దారుణ హత్య

- వరుసకు మామను చంపిన అల్లుడు
- పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


మునిరొద్దీన్ (ఫైల్)

వట్‌పల్లి(అందోల్): భూ తగాదాల కారణంగా ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన అందోలు మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్మాయిపేట గ్రామానికి చెందిన ఇస్మాయిల్, కరీమ్, ఖాజాపాషాలు ముగ్గురు అన్నాదమ్ముళ్లు. ఇందులో కరీమ్ భార్య హయాబీ పేరిట అల్మాయిపేట శివారులో ఉన్న 1.30 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ప్రస్తుతం ఈ భూమిని కరీమ్ అల్లుడైన ఖమ్రొద్దీన్ సాగు చేసుకుంటున్నాడు. కానీ, ఈ భూమి ముగ్గురికి సంబంధించింది అని ఇస్మాయిల్ కొడుకు మునిరొద్దీన్ (50) ఖమ్రొద్దీన్‌తో తరచూ గొడవ పడుతుండేవాడు. ఈ నెల 11న ఆదివారం జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఇరు కుటుంబాల వారికి పోలీసులు నచ్చజెప్పి పంపించారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఖమ్రొద్దీన్ కొడుకు గఫార్ పొలం పనులు చేయిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మునిరొద్దీన్ పొలం వద్దకు వెళ్లి వరుసకు అల్లుడైన గఫార్‌తో గొడవ పడ్డాడు. మాటామాటా పెరిగి సహనం కోల్పోయిన గఫార్ మునిరొద్దీన్‌పై పార, రాయితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృత చెందాడు. గఫార్ వెంటనే జోగిపేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. మృతుడి భార్య జమురున్నీసా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

### కరెన్సీ కనువిందు..



మనుమల మనుగడలో ముఖ్యపాత్ర పోషించేంది కరెన్సీయే.. అదే ఒకే విలువగల నోటు మూడు విధాలుగా ఉంటే విశేషమే కథా.. మనం నిత్యం చూసే రూ.20ని నాణేంగా, రెండు రంగుల నోటుగా కనిపిస్తే ఎలా ఉంటుందో ఈ చిత్రం చూస్తే మీకే అర్థమవుతుంది. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఓ వ్యక్తి వద్ద కనిపించాయి ఇలా..

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

